సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
90324 97123
నంబర్‌ను సంప్రదించండి

మహాత్ముడి మార్గం అనుసరణీయం

- మత సామరస్య జీవనమే అసలైన నివాళి
- పేర్కొన్న వక్తలు
- వాడవాడలా గాంధీజీ వర్ధంతి


నూతన వస్త్రాలు అందజేసిన కార్యవర్గ సభ్యులు

మహాత్ముడి మార్గం ప్రతీ ఒక్కరికీ అనుసరణీయమని వక్తలు పేర్కొన్నారు. గాంధీజీ వర్ధంతి సందర్భంగా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో నాయకులు ప్రసంగించారు. అహింసే ఆయుధంగా బ్రిటిష్‌వారిపై గాంధీజీ చేసిన పోరాటాలు ఆదర్శనీయమన్నారు. శాంతితో, పరమత సహనంతో ప్రతీ ఒక్కరినీ ఆదరించారన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు సాగాలని కోరారు.

మహారాణిపేట: జాతిపిత మహాత్మా గాంధీ చూపిన మార్గాన్ని మనమందరం అనుసరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్ అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్‌లోని మహాత్మ గాంధీ విగ్రహానికి సోమవారం జాయింట్ కలెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్, డీఆర్‌ఓ శ్రీనివాస మూర్తి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. జేసీ మాట్లాడుతూ సత్యం, అహింస గాంధీజీ నమ్మిన సిద్ధాంతాలన్నారు. నూలు వడికి, మురికివాడలు శుభ్రం చేస్తూ అన్ని కులాలు, మతాలు ఒకటే అని చాటి చెప్పిన మహానుభావుడన్నారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ రమణమూర్తి, జిల్లా సహకార అధికారి మిల్లన్, పంచాయతీరాజ్ ఎస్ఈ రవీంద్ర, ఈపీడీసీఎల్ ఎస్ఈ మహేంద్రనాథ్, డీఈవో చంద్రకళ, పలువురు జిల్లా అధికారులు, కలెక్టరేట్‌లోని అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


జీవీఎంసీ గాంధీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

మతసామరస్యంతో జీవించాలి

సీతమ్మధార: ప్రజలందరూ మత సామరస్యంతో శాంతియుతంగా జీవించి, సమాజాన్ని సక్రమ మార్గంలో ముందుకు తీసుకువెళ్లిన నాడే గాంధీజీకి నిజమైన నివాళులు అర్పించిన వారమవుతామని నాయకులు పేర్కొన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా ఇస్కఫ్ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహానికి నాగార్జున విశ్వ విద్యాలయం మాజీ ఉపకులపతి ఆచార్య బాలమోహన్‌దాస్, విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు చలసాని రాఘవేంద్రరావు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి, ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షుడు టి.ఎస్. సుకుమారన్ తదితరులు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, సభ్యులు కె.సత్యాంజనేయ, క్షేత్రపాల్, రెహమాన్, కాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ ఆశయాలతో ప్రేమసమాజం నిర్వహణ

దాబాగార్డెన్స్: గాంధీజీ ఆశయ సాధనకు కృషి చేస్తున్నామని ప్రేమసమాజం అధ్యక్షుడు పైడా కృష్ణప్రసాద్ అన్నారు. మహాత్మాగాంధీ 75వ వర్ధంతిని పురస్కరించుకుని ప్రేమసమాజం మినీ సమావేశ మందిరంలో కుష్టు నివారణ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాలకు చెందిన గురువులు వసంతరావు రామలింగేశ్వరరావు, మహ్మద్ జఫలీ ఆలీ, సుజోహన్ రత్నపాల్ మహాత్ముడి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ప్రేమసమాజం గాంధీ మహాత్ముడి ఆశయాలతో నడుస్తోందన్నారు. ప్రేమసమాజం స్థాపించిన నాటి నుంచి గాంధీజీ జయంతి, వర్ధంతి కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ఏవీఎన్ కాలేజ్ డౌన్‌రోడ్డులోని ప్రేమసమాజం కుష్టు శరణాలయంలో ఆశ్రయం పొందుతున్న వారికి నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో కోన జగదీశ్వరరావు, పి. రాము, డి.సింహాచలం, బుద్ధ శివాజీ, కె నర్సింహమూర్తి, సంయుక్త కార్యదర్శి ఎస్ అప్పలరాజు, కోశాధికారి మట్టపల్లి హనుమంతరావుతదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న జేసీ విశ్వనాథన్ తదితరులు


గాంధీ మహాత్ముని విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న వాసవి క్లబ్ సభ్యులు


మహాత్ముని విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నివాళులు అర్పిస్తున్న రంధి గోపీ తదితరులు

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో..

అల్లిపురం: వాసవీ క్లబ్ అల్లిపురం సభ్యులు మెయిన్ రోడ్డులోని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వాసవి క్లబ్ రీజనల్ ఛైర్ పర్సన్ వరిగాల పండు, క్లబ్ ప్రెసిడెంట్ డీవీఎస్ఎన్ రాజు, పూర్వ అధ్యక్షుడు విఠల్‌కుమార్, సెక్రటరీ బీవీఎల్ కుమార్, కోశాధికారి వీవీఎస్ఆర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళులు

అల్లిపురం: సర్వజన హితం నా మతం .. అంటరానితనాన్ని, అంతః కలహాలను అంతం చేసేందుకు నా ఆయువు అంకితం అని మహాత్మాగాంధీ తన జీవితాన్ని జాతికి అంకితం చేశారని వైఎస్సార్‌సీపీ 33వ వార్డు అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ అన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి, అమరవీరుల దినోత్సవాలను పురస్కరించుకుని సోమవారం సాయంత్రం అల్లిపురం మెయిన్‌రోడ్డులోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద రంధి గోపీ ఆధ్వర్యంలో వార్డు నాయకులు, కార్యకర్తలు కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ నిత్యం అహింసాయుత మార్గంలో సత్యమే పరమావధిగా జీవించిన మహనీయుడన్నారు. అదే మార్గంలో భారతావనికి స్వాతంత్ర్యం సంపాదించిన మహనీయుడని స్మరించుకున్నారు. కార్యక్రమంలో వార్డు నాయకులు ఆడారి వెంకట మహేష్, భీశెట్టి రాజు, కణితి బ్రహ్మం, నీలాపు అయ్యప్పరెడ్డి, పిల్లి శివ, కొల్లి సత్యవతి, గురుస్వామిరెడ్డి, శంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచి, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహించనున్నారు. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.

పందుల నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్


పందులను తరలిస్తున్న సిబ్బంది

దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): నగర పరిశుభ్రతకు విఘాతం కలిగిస్తున్న పందుల నిర్మూలనకు జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు ఆదేశాల మేరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. నగరంలో భారీ స్థాయిలో పందులు కాల్చివేతతో పాటు నగరం నుంచి తరలింపు కార్యక్రమం చేపట్టినట్టు సిటీ వెటర్నరీ అధికారి డాక్టర్ కిషోర్ తెలిపారు. పెంపకందారులను పలు మార్లు హెచ్చరించినప్పటికీ వారిలో ఎటువంటి మార్పు కనిపించడం లేదని, అందుకు కఠిన చర్యలు చేపట్టామన్నారు. గాజువాక, జ్ఞానాపురం, మధురవాడ తదితర ప్రాంతాల్లో ఆర్మ్ రిజర్వ్‌డ్ పోలీసుల సహకారంతో పులివెందుల జంగారెడ్డిగూడెం నుంచి వచ్చిన 8 బృందాల ద్వారా సుమారు 621 వరకు పందులను పట్టుకుని ఇతర రాష్ట్రాలకు తరలించామని చెప్పారు. మరో 252 పందులను కాల్చి చంపామన్నారు. జీ–20 సదస్సు మార్చి నెలలో జరుగుతున్న దృష్ట్యా నగరం నుంచి పందులు పూర్తిగా నిర్మూలిస్తామని, కొంత మంది పెంపకందారులు ఇప్పటికే పందులను బయటకు తరలిస్తున్నారని వివరించారు. విధులకు ఆటంకం కలిగిస్తే పెంపకందారులపై చర్యలు తీసుకుంటామని డాక్టర్ కిషోర్ హెచ్చరించారు.

క్లుప్తంగా

41వ వార్డులో జెడ్సీ పర్యటన


వార్డులో సమస్యలను జెడ్సీ కృష్ణకు వివరిస్తున్న కార్పొరేటర్ పూర్ణిమ

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలోని పలు ప్రాంతాల్లో జోన్–5 కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులోని పలు సమస్యలను కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ జెడ్సీ దృష్టికి వెళ్లారు. వార్డు పరిధి జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, బాబు కాలనీ, సెబాస్టియన్ కాలనీ, స్లీప్‌గుర్తు వీధి తదితర ప్రాంతాల్లో వారు పర్యటించారు. పారిశుద్ధ్య సమస్యలు, విద్యుత్ దీపాలు, కుక్కల బెడద, దోమల సమస్యలను జోనల్ కమిషనర్‌కు వివరించారు. అభివృద్ధి పనులపై సత్వరమే స్పందించాలని ఇంజినీరింగ్, ప్రజారోగ్య శాఖ అధికారులను జెడ్సీ ఆదేశించారు. అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ఐ.వి.రమణ మూర్తి ఆదేశించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ వర్క్స్ ఈఈ శ్రీనివాసరావు, డీఈ భరణి కుమార్, ఏపీడీ పద్మావతి, సీవో గణేష్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి


మునిబాబు (ఫైల్)

అల్లిపురం: అనారోగ్యంతో చికిత్స పొందుతూ గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందారు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలివి.. మునిబాబు (42) అనే వ్యక్తి కేజీహెచ్‌లో చికిత్స నిమిత్తం చేరారు. అనంతరం ఈ నెల 26వ తేదీన మృతి చెందినట్లు టూటౌన్ పోలీసులకు సమాచారం అందజేశారు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. టూటౌన్ హెడ్ కానిస్టేబుల్ ఎం.రమణమూర్తి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. చనిపోయిన వ్యక్తి 5 అడుగుల 1 అంగుళం ఎత్తు కలిగి చామనఛాయగా ఉన్నాడని, తెలుపురంగు కట్ బనియన్, సిమెంట్ కలర్ ట్రాక్ ధరించి ఉన్నాడని తెలిపారు. వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు 0891–2783672, 9490391090 ఫోన్ నంబరులో తెలియజేయాలని కోరారు.

ఇంటర్న్‌షిప్‌పై అధ్యాపకులకు శిక్షణ


మాట్లాడుతున్న కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయబాబు

మద్దిలపాలెం: ఇంటర్న్‌షిప్, అప్రెంటిస్‌షిప్ మేనేజ్‌మెంట్, లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టంపై నాలుగో బ్యాచ్ శిక్షణ కార్యక్రమం సోమవారం నోడల్ రిసోర్స్ సెంటర్ అయిన కృష్ణా కళాశాలలో ప్రారంభమైంది. ఈ శిక్షణ వచ్చేనెల ఒకటో తేదీ వరకూ ఉంటుందని నోడల్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. విద్యార్థుల్లోని నైపుణ్యానికి పదును పెట్టి వారిలో ఉపాధికి దోహదపడే వృత్తులపై అవగాహన కల్పించాలని సూచించారు. ఇంటర్న్‌షిప్, అప్రెంటిస్‌కు దోహదపడే అంశాలను విద్యార్థులకు వివరించాలన్నారు. శిక్షణ కో–ఆర్డినేటర్ డాక్టర్ రాజశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, ట్రైనర్లు శ్రీనివాస్, ప్రసాద్, విద్యాసాగర్, సిహెచ్.లలిత, కె.రవిబాబు పాల్గొన్నారు.

130 కిలోల గంజాయి స్వాధీనం

సింహాచలం: కారులో తరలిస్తున్న 130 కిలోల గంజాయిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకుని, ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ నగర ఏసీపీ ఎ.త్రినాథరావు తెలిపిన వివరాలు ప్రకారం..కేరళకు చెందిన కె.బి.శశికుమార్ అనే వ్యక్తి ఆదివారం కారులో 130 కిలోల గంజాయిని తరలిస్తుండగా పెందుర్తి జంక్షన్‌లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి రెండు ఫోన్లు, కారు స్వాధీనం చేసుకుని పెందుర్తి పోలీసుస్టేషన్‌లో అప్పగించారు. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సులో మేయర్ ప్రయాణం


క్యాంపు కార్యాలయం నుంచి జీవీఎంసీకి వచ్చేందుకు బస్సు ఎక్కుతున్న మేయర్

దాబాగార్డెన్స్: పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణలో భాగంగా మేయర్ గొలగాని హరి వెంకటకుమారి సోమవారం ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేశారు. తన క్యాంపు కార్యాలయం నుంచి నడుచుకుంటూ ఆర్టీసీ బస్టాప్‌కు చేరారు. సిటీ బస్సెక్కి సాధారణ ప్రయాణికుల వలే డబ్బులిచ్చి టికెట్ తీసుకున్నారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వరకు ప్రయాణించి జీవీఎంసీలో నిర్వహించిన డయల్ యువర్ మేయర్, స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు. చాలా మంది అధికారులు సొంత వాహనాల్లో కార్యాలయానికి వస్తున్నట్టుగా తెలిసిందని, సొంత, ప్రభుత్వ వాహనాలు విడనాడి ప్రైవేట్ వాహనాలపై రావాలని మేయర్ ఆదేశించారు.

కుష్టు వ్యాధిపై అవగాహన అవసరం


కుష్టు రోగులకు బియ్యం అందిస్తున్న జిల్లా లెప్రసీ, టీబీ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు

మహారాణిపేట: కుష్టు వ్యాధిపై ప్రజలకు అవగాహన అవసరమని డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు అన్నారు. మహాత్మా గాంధీజీ వర్ధంతి సందర్భంగా సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, టీబీ, లెప్రసీ నివారణ శాఖ సంయుక్తంగా ర్యాలీ నిర్వహించాయి. డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద ప్రారంభమైన ప్రదర్శన టీబీ ఆస్పత్రి జంక్షన్ వరకు వెళ్లి తిరిగి డీఎంహెచ్‌వో కార్యాలయానికి చేరుకుంది. తొలుత గాంధీ చిత్రపటానికి డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సహకారంతో కుష్టు వ్యాధి నిర్మూలన సాధ్యమన్నారు. జిల్లా లెప్రసీ, టీబీ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు మాట్లాడుతూ కుష్టు వ్యాధి రహిత జిల్లాగా విశాఖను చేయాలని పిలుపునిచ్చారు. వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సత్యవేణి, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాతలు మనోజ్ వైభవ్ జెమ్స్ అండ్ జ్యూయలర్, మానవతా సేవా చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో 40 మంది కుష్టు రోగులకు బియ్యం, తువ్వాళ్లు అందజేశారు. అలాగే డ్రెస్సింగ్ కిట్స్ పంపిణీ చేశారు.

శ్రీవారికి పుష్పాభిషేకం


పుష్పాలంకరణలో వేంకటేశ్వరస్వామి

ఎంవీపీ కాలనీ: స్థానిక సెక్టార్–6లోని శ్రీవేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా సోమవారం శ్రీవారికి పుష్పార్చన సేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారు వివిధ రకాల పుష్పాల అలంకరణలో కనువిందు చేశారు. 75 కేజీల చామంతి, గులాబి, కనకాంబరాలు తదితర పుష్పాలను స్వామివారికి అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. పుష్పార్చన అనంతరం యాగశాలార్చన, నిత్య పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

రైతుబజార్‌లో రూ.35 వేల చోరీ

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లో నగదు చోరీ జరిగింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. అల్లూరి సీతారామరాజు జిల్లా, డుంబ్రిగుడ మండలం పాడి గ్రామానికి చెందిన అరకు రైతు బి.ఆనందరావు తను పండించిన కూరగాయలను శుక్రవారం రాత్రి సీతమ్మధార రైతుబజార్‌కు తీసుకొచ్చారు. శని, ఆదివారాల్లో కూరగాయలు విక్రయించిన నగదు రూ.35 వేలను రైతుబజార్‌లో గిరిజనులకు ఇచ్చిన రూంలోని పెట్టెలో పెట్టారు. సోమవారం ఉదయం లేచి పెట్టె చూసేసరికి కనిపించకపోవడంతో ఎంవీపీ పోలీసులకు రైతు ఆనందరావు ఫిర్యాదు చేశారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం


యజ్ఞోపవీత ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉదయం 9.30గంటల నుంచి కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేదికపై వేంజేప చేసి కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు.

18న అంతర్జాతీయ సంగీత ప్రదర్శన


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏజ్ కేర్ ఫౌండేషన్ ప్రతినిధి సాంబశివరావు తదితరులు

బీచ్ రోడ్డు: క్యాన్సర్ రోగులకు నిధుల సేకరణలో భాగంగా వచ్చేనెల 18న అంతర్జాతీయ సంగీత ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు రోహిత్ మెమోరియల్ ట్రస్ట్ ప్రతినిధి మీనాక్షి తెలిపారు. సోమవారం నగరంలోని ఒక హోటల్‌లో ప్రదర్శన పోస్టర్‌ను ఏజ్ కేర్ ఫౌండేషన్ ప్రతినిధి సాంబశివరావు, వీసీసీఐ ఉమెన్స్ వింగ్ అధ్యక్షుడు జిజా వల్సరాజ్, ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంక్ మెడికల్ డైరెక్టర్ సుగంధి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మీనాక్షి మాట్లాడుతూ ఏడుగురు సంగీతకారులు, నృత్యాకారులతో కూడిన అంతర్జాతీయ బృందంతో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. ఈ ప్రదర్శన ద్వారా వచ్చిన విరాళాలను దేశ వ్యాప్తంగా క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. పూర్తి వివరాల కోసం 93486 23225, 99496 27222 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఆమె కోరారు.

కేంద్ర కారాగారం సందర్శన


ఖైదీలకు అవగాహన కల్పిస్తున్న డీఎల్ఎస్ కార్యదర్శి బులికృష్ణ

ఆరిలోవ: జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి కె.కె.వి.బులికృష్ణ సోమవారం విశాఖ కేంద్ర కారాగారాన్ని సందర్శించారు. ఇక్కడ ఖైదీల బేరక్‌లు, వంటశాల, ఆస్పత్రి తదితర వాటిని పరిశీలించారు. సౌకర్యాల గురించి ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన రిమాండ్ ఖైదీలకు న్యాయపరమైన విధానాలపై అవగాహన కల్పించారు. లీగల్ ఎయిడెడ్ డిఫెన్స్ కౌన్సిల్ గురించి తెలియజేశారు. ఖైదీలు న్యాయ సేవాధికార సంస్థ సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు జైల్ అధికారులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ముగిసిన భాగవత సప్తాహం


ప్రవచిస్తున్న శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో జరుగుతున్న భాగవత సప్తాహం సోమవారంతో ముగిసింది. చివరి రోజు కుర్తాళం పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి అనుగ్రహ భాషణంలో బృందావనం విశేషాలను, గోపికల మధుర భక్తిని వివరిస్తూ పోతన పద్యాలను మధురంగా ఆలపించారు. రాధాదేవి భక్తిని ప్రేమతత్వాన్ని సరళ సుందరంగా విశ్లేషించారు. రాధాకృష్ణ లీలల్ని, కంస వధ, కాలయవనుల వినాశనాన్ని ఆసక్తికరంగా వివరించారు. కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద స్వామిని, పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేస్, పలువురు భక్తులు పాల్గొన్నారు.

రుక్మిణీ కల్యాణం నేడు..

లలితా పీఠం దర్బారు హాల్లో మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు రుక్మిణీ సహిత శ్రీకృష్ణ కల్యాణం జరుగుతుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేస్ తెలిపారు. ముందుగా ప్రియాంక భరతనాట్యంతో అలరిస్తుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కల్యాణం వీక్షించి తరించాలని కోరారు.

పేదల అభ్యున్నతే సీఎం జగన్ లక్ష్యం


గంగులగెడ్డ సమస్యపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్: పేద ప్రజల అభ్యున్నతే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, ఇచ్చిన హామీల్లో ఇప్పటికే 98 శాతం పథకాలు అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం సోమవారం 31వ వార్డు 1086210 గొల్లలపాలెం సచివాలయ పరిధిలో కార్పొరేటర్ బిపిన్ కుమార్‌జైన్‌తో కలిసి వాసుపల్లి నిర్వహించారు. సరస్వతి పార్క్, రంగా స్ట్రీట్, గంగులగెడ్డ, డాబాగార్డెన్స్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ప్రభుత్వ పాలన ఎలా ఉంది తల్లీ.. అంటూ ఇంటింటికీ వెళ్లి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అమలు తీరు.. సచివాలయ వ్యవస్థ పనితీరు.. పెన్షన్ల అమలు ప్రక్రియ ఎలా సాగుతుందో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలనలో అందరూ సంతోషంగా ఉన్నారన్నారు. కేవలం అర్హతే ప్రామాణికంగా పార్టీలు, కులాలు, మతాలకతీతంగా పథకాలు మంజూరు అవుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శివప్రసాద్, డీఈఈ వెంకటేష్, ఏఈ పార్వతి, టౌన్‌ప్లానింగ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, వాటర్ సప్లై ఏఈ రవికుమార్, ఎలక్ట్రికల్ ఏఈ రవిశంకర్, ఎలక్ట్రికల్ ఏఈ అన్నంనాయుడు, వర్క్ ఇన్‌స్పెక్టర్ సూర్య, వార్డు నాయకులు బత్తిన నవీన్ కుమార్, దొడ్డి బాపూ ఆనంద్, ధనలక్ష్మి, భవాని, రాంబాబు, పల్లా శ్రీనివాస్, నక్కా వేణుగోపాల్, పెంటకోట బాబూరావు, లండా రమణ, బొగ్గు శ్యామ్, బోని దేవా, ఆర్పీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ల్యాబ్ నుంచి పాఠశాలకు..

- మహిళా కళాశాల విద్యార్థినుల ప్రత్యేక కార్యక్రమం
- రసాయన శాస్త్రంలో పలు అంశాలపై స్కూల్ విద్యార్థులకు వివరణ


మధురానగర్ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మహిళా కళాశాల విద్యార్థినులు

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు బెస్ట్ ప్రాక్టీసెస్‌లో భాగంగా సోమవారం ల్యాబ్ టు స్కూల్ కార్యక్రమం నిర్వహించారు. రసాయన చర్యలు, అంశిక స్వేదన ప్రక్రియ, ఆమ్ల–క్షార సూచికలు వంటి అంశాలను ప్రయోగాల ద్వారా మధురానగర్ జీవీఎంసీ పాఠశాలలోని 9, 10 తరగతి విద్యార్థులకు వివరించారు. కళాశాల రసాయనశాస్త్ర విభాగాధిపతి సంతోషి అనూష మాట్లాడుతూ దైనందిన జీవితంలో రసాయనశాస్త్ర అనువర్తనాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం రసాయనశాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ ఎ.హైమావతి మాట్లాడుతూ కెమిస్ట్రీని అధ్యయనం చేయడం వల్ల భవిష్యత్తులో విద్యార్థులకు లభించే ఉపాధి అవకాశాల గురించి వివరించారు. కార్యక్రమంలో రసాయనశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ బి. కల్యాణ్‌రామ్, బి.ప్రశాంతి, కళాశాల విద్యార్థినులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఏయూ సంగీత విభాగంలో 3, 4 తేదీల్లో సదస్సు

ఏయూ క్యాంపస్: ఏయూ సంగీత విభాగంలో వచ్చే నెల 3, 4 తేదీలలో సంగీత దర్శకులు, గాయకులు సాలూరి రాజేశ్వరరావు, ఘంటసాల వెంకటేశ్వరరావులపై రెండు రోజుల వర్క్‌షాప్ నిర్వహించనున్నట్టు విభాగాధిపతి ఆచార్య ఎ.అనూరాధ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ సదస్సు జరుగుతుందన్నారు. ఘంటసాల, సాలూరి స్వరపరిచిన సంగీతంపై అతిథులు ప్రసంగాలు ఉంటాయని చెప్పారు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన ఈ సంగీత దర్శకులను స్మరించుకుంటూ, వారి సేవలను గుర్తుచేస్తూ భవిష్యత్ తరానికి వారి సంగీత మాధుర్యాన్ని అందించడం సదస్సు ప్రధాన ఉద్దేశమన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ సౌత్
7997958342, 9912440606

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ సౌత్
9010196663
Office mail : sakshiadvtvsp@gmail.com